# తిక్క కుదిరింది

-గుజ్జు సురేష్‌రెడ్డి

'పుర్రెకో బుద్ధి..' అని ఊరకే అనలేదనిపిస్తుంది ముకుందాన్ని చూస్తే. ముకుందానికి అప్పుడప్పుడు తిక్క తిక్క ఆలోచనలు వస్తుంటాయి. 'టీ'లో పంచదారకు బదులు ఉప్పు కలుపుకోవాలని, రోడ్డుపై నడిచేటప్పుడు కళ్లు మూసుకొని నడవాలని, ఖాళీగా ఉన్నాం కదా అని ఎవరితోనయినా కయ్యం పెట్టుకోవాలని... ఇలాంటివి.

అయితే వచ్చిన చిక్కేమిటంటే కేవలం ఆలోచన దగ్గిరే ఆగిపోతే పర్లేదు. కానీ రెండో ఆలోచన లేకుండా తనకు తోచిన తిక్క ఆలోచనలను అమలు పరుస్తాడు. తత్ఫలితంగా సరదాకి చేస్తే దురద తీరిందన్నట్లు అనవసరమైన ఇక్కట్లలో ఇరుక్కుంటుంటాడు.

ఈ బుద్ధి ఆయనకు చిన్నప్పట్నుంచి వుంది. క్లాసులో ముకుందమే బెస్ట్ స్టూడెంట్. ఏ సబ్జెక్టు లోంచి ఏ క్వశ్చన్ అడిగినా ఠకీమని జవాబు చెప్పేవాడు. అయినా, పరీక్షల్లో కాపీ కొడితే ఆ అనుభవం ఎలా వుంటుందో చూడాలన్న వెర్రి కోరిక కలిగింది. వెంటనే దాన్ని అమలు పరిచాడు. పాపం! దురదృష్టవశాత్తు మాష్టారి కంట పడి కర్ర విరిగేవరకు దెబ్బలు తిన్నాడు.

'అమ్మోయ్..బాబోయ్...' అంటూ కేకలు వేసాడు తప్పితే ఆ అలవాటును మాత్రం వదిలించుకోలేకపోయేడు.ఆఫీసుకొచ్చిన దగ్గర్నుంచి చేయాల్సిన వర్క్‌పై దృష్టిపెట్టక దేనికోసమో వెరీ సీరియస్‌గా ఆలోచిస్తున్నాడు ముకుందం.

అది తన కొలిగ్ ప్లస్ మిత్రుడు అయిన రామకృష్ణ గమనించి "ఏమిటి ముకుందం దీర్ఘంగా ఆలోచిస్తున్నావ్... మీ ఇంటి ఇల్లాలికి ఏ నగలు చేయిద్దామనా?" రేడియోలో సిమెంట్ రేకుల యాడ్‌ని పేరడీ చేస్తూ అడిగాడు.

ఆ పలకరింపుకి ధ్యానభంగమై "నగలా, పాడా... మా ఆవిడతో గొడవ ఎలా పెట్టుకోవాలా అని ఆలోచిస్తున్నా... కానీ, నా వెధవ బుర్రకి తట్టి చావడంలేదు" కాసింత అసహనంగా అన్నాడు.

ఆ మాటకి రామకృష్ణ అదిరిపడి అంతలోనే విషయం అర్థమై "బుర్రకి తట్టకపోవడం అటుంచు, ఎవరైనా వింటే నీ బుర్ర పాడైందనుకుంటారు. ఎవడైనా కాపురం సుఖంగా వుండాలనుకుంటారు. కోరి కలహాలు పెట్టుకొని కూల్చేసుకోవాలనుకోరు. అయినా నీ టైప్ మనిషిని నేనెక్కడా చూల్లేదయ్యా బాబు" హెచ్చరిస్తున్నట్లుగా అన్నాడు.

"ప్రతీ సంసారంలోను గొడవలు, గోలలు, అలకలు, మనస్తాపాలు వస్తూ వుంటాయి. కానీ నా భార్యకూ, నాకు అలాంటి సందర్భమే రాలేదు. చిత్రంగా అదే నాకు నచ్చట్లేదు. కాపురం హ్యాపీగా సాగిపోతుంటే పరమబోరుగా వుంది. అందుకే ఈ రోజు ఎలాగైనా యుద్ధం తేవాల్సిందే" ఒళ్లు విరుచుకుంటూ ఛాలెంజ్ చేస్తున్నట్లుగా అన్నాడు.

"పోయేకాలం వస్తే అంతే, కోరి పొయ్యిలో పడతారు. నీ ఖర్మ అనుభవించు" శపిస్తున్నట్లు అన్నాడు రామకృష్ణ.

ముకుందం మెంటాలిటీని పొరపాటున ఎవరైనా చూసారంటే మరుక్షణం అక్కడినుండి మాయమైపోతారు ఆ జబ్బు వాళ్లకెక్కడ అంటుకుంటుందోనని.

కానీ, కట్టుకున్న పాపానికి మీనాక్షి మాత్రం మౌనంగా భరిస్తోంది. ఈయన బుద్ధి ఎప్పటికయినా మారకపోతుందా అని ఎదురుచూస్తోంది.

నిన్నటినుండి ఆమెతో వైరం తెచ్చుకోవాలని విక్రమార్కుడిలా ప్రయత్నిస్తున్నప్పటికీ, మీనాక్షి నెమ్మదిగా ఉండడంతో ముకుందం ప్రయత్నాలు బెడిసికొడుతున్నాయి.

అయినా సరే ఆమెనెలాగైనా రెచ్చగొట్టాలని పాములా బుసకొడుతున్నాడు. ఎండు మిరపకాయలు తిన్న కాకిలా అరుస్తున్నాడు. గాడిదలా ఓండ్ర పెడుతున్నాడు. ఆంబోతులా రంకెలేస్తున్నాడు. మీనాక్షి చేతివంట అమృతంలా దిగిపోతుంది. అయినా సరే ఏదో ఒక సాకుతో గొడవ తేవాలని "ఏంటిది ఈ పచ్చడిలో ఇంతెక్కువగా ఉప్పూకారం వేస్తావా? మంట నషాలానికి అంటుతుంది" గయ్‌మని లేచాడు.

"మీరు తిన్నది మార్కెట్‌లో కొన్న పచ్చడి. నేను చేసింది కాదు" మామూలుగానే చెప్పింది మీనాక్షి.

ముకుందం అంతటితో ఆగక "తప్పు చేసింది కాక మళ్లీ తిరిగి సమాధానం చెప్తున్నావా?" గొంతు మరింత పెంచాడు.

చేయని తప్పుకి నిందించేసరకి తట్టుకోలేకపోయింది.

"చెప్తున్నాగా అది నేను చేయలేదని. అంతగా ఎగరాలనుకుంటే వెళ్లి ఆ షాపువాడిని అడగండి" తనూ కాస్త సౌండ్ పెంచింది.

ఛాన్స్ దొరికిందని మనసులో ఆనందపడ్తూనే, పైకిమాత్రం కోపంగా ఉన్నట్లు నటిస్తూ "నువ్వు ముందుగా పెట్టే ఐటమ్‌లో ఉప్పు, కారం వగైరాలు సరిగ్గా ఉన్నాయో లేవో టెస్ట్ చేసి ఆ తరువాత నాకు పెట్టాలి. ఇప్పుడు దీనివలన నాకు బి.పి. రావచ్చు, అల్సర్ రావచ్చు. వచ్చాక ఎన్నిసార్లు హాస్పిటల్ చుట్టూ తిరగాలి, ఎన్ని మాత్రలు వేసుకోవాలి. ఎన్ని ఇంజక్షన్‌లు చేయించుకోవాలి, ఎన్ని బాధలు పడాలి. టోటల్‌గా ఎంత డబ్బు ఖర్చుపెట్టాలి" గోరంత విషయాన్ని కొండంత చేస్తూ అధికార పార్టీపై ప్రతిపక్ష పార్టీలా చిందులేయసాగాడు.

"చిటికెడు ఉప్పు ఎక్కువైనంత మాత్రాన అంతమాత్రానికే కల్లు తాగిన కోతిలా చిందులేయాలా?" చిరాగ్గా అంది మొహం చిట్లిస్తూ.

"నన్ను కోతీ అంటావా... అసలు నిన్ను కన్న మీ అమ్మానాన్నలే చింపాంజీలు" యుద్ధం మరింత పెద్దది చేస్తూ అన్నాడు.

తన అమ్మానాన్నల్ని అనేసరికి మీనాక్షి రక్తం పెనంలో నూనెలా మరిగిపోయింది. కోపంతో చెంగు ఎగదోసి "ఇంకొక్కసారి మళ్లీ అన్నారంటే ఒక్కక్షణం కూడా ఇక్కడ ఉండను" అంది రోషంగా.

"ఒక్కసారి కాదు వందసార్లంటాను. టోటల్ మీ వంశమే వానరవంశం" అన్నాడు ఎగతాళిగా పళ్లు చికిలిస్తూ.

అంతే మరుక్షణంలో మీనాక్షి, ఆమెతోపాటు వి.ఐ.పి. అల్ఫా బ్రీఫ్‌కేసు నట్టింట్లో నుండి నడి రోడ్డు మీదకి చేరాయి.

మీనాక్షి అలా వెళ్లిపోతుంటే మండుటెండలో నుండి మంచుకొండలోకి దూకినంత ఆనందం కమ్మేసింది ముకుందాన్ని. ఆ ఆనందంలో పిచ్చి గెంతుల్లాంటి డాన్సులతో ఇల్లంతా అదిరేటట్లు స్టెప్పులేసాడు. మైకేల్ జాక్సన్ పూనినట్లు ఊగిపోయాడు.

పాపం! తన సరదాయే తన సంకటంగా మారబోతుందున్న విషయం తెలీని ముకుందం.

★★★

ఉదయం ఆరింటికే దబదబామని తలుపు చప్పుడవుతుంటే మెలకువ వచ్చింది ముకుందానికి. తన భార్య అలిగి పుట్టింటికెళ్లింది కదా రాజీ కుదర్చడానికి వాళ్ల నాన్నను పంపిందేమో అను కొని తన అణువణువున ఆనందం తొణికిసలాడు తుంటే పైకి మాత్రం ఆ ఛాయలు కనబడనీయ



కుండా వెళ్లి తలుపు తీసాడు. అతను ఊహించినట్టే ఎదురుగా మామాశ్రీని చూసి సంతోషంతో రెండింతలవ్వబోయాడు. మరుక్షణంలో కరెంట్‌షాక్ కొట్టిన కాకిలా అయిపోయాడు. ఎదురుగా పిల్లనిచ్చిన మామాశ్రీతోపాటు మరో ఇద్దరు పోలీస్ మామాశ్రీలుండటం చూసి ముకుందం ఒళ్లంతా నీరై కాళ్లల్లో వణుకు ప్రారంభమైంది.

"ఇదిగోండి ఇతనే సెంచరీ కొట్టాల్సిన నా కూతుర్ని ట్వంటీఫైవ్‌కే ఔట్ చేసి నా కూతురి లైఫ్‌తో క్రికెట్ ఆడుకొని, పెవిలియన్‌లో కూర్చున్న ఎక్స్‌ట్రా ప్లేయర్‌లా ఫేసు ఎలా అమాయకంగా పెట్టాడో చూడండి" కంప్లైంట్ చేసాడు మీనాక్షి తండ్రి. ఆ షాక్‌కి నెత్తిన బాంబు పడ్డట్టు గుభేల్ మంది ముకుందం గుండె. ఒక పట్టాన నోటిలోంచి మాటరాలేదు.

"నిన్న నువ్వు నీ భార్యని గృహహింసకు గురి చేసి ఇంటినుంచి గెంటేసావంట. ఆమె కోపంతో వాళ్ల నాన్నకు ఫోన్ చేసి ఎక్కడికి పోతానో, ఏమైపోతానో నాకే తేలీదని చెప్పిందట. పదా... నీ పాపం పండింది. నీకు సెల్‌లో హెల్ చూపిస్తాం" అని కానిస్టేబుల్ కిందకి, పైకి లాఠీ ఊపుతుంటే, ముకుందం కంటికి కానిస్టేబుల్ 'గొర్రెను నమిలేసే పులి'లా కనిపించాడు.

"నా మాట వినండి ప్లీజ్...నేనేదో కావాలని అలా చేయలేదు. ఏదో సరదాకి గొడవ పెట్టుకుందామని..." నసిగాడు వణుకుతున్న స్వరంతో.

ఆ మాటకి ఎస్సై తారాజువ్వలా లేచాడు.

"ఏంటీ...సరదాకి గొడవ పెట్టుకున్నావా? ఖాకీలకే కథలు చెప్తావురా భడవా?" అని వీపుమీద లాఠీతో ఒక్కటి చరిచాడు.

బ్యాక్‌బోన్ చిట్లినట్లయి "చచ్చాను బాబోయ్" అని గావుకేక పెట్టి, పిల్లనిచ్చిన మామ కాళ్ల మీద పడ్డాడు చిన్నపిల్లాడికి మల్లే ఏడుస్తూ.

"నన్ను క్షమించు మామయ్యా... మీ అమ్మాయి ఎక్కడున్నా వెతికి తెచ్చి మీకప్పగిస్తాను...ఒట్టు! కొట్టొద్దని చెప్పు మామయ్యా...తోలు తీసి బెల్టులు కుట్టించుకునేలా ఉన్నాడు" బావురుమన్నాడు.

"సరే...సాయంత్రం వరకు టైమివ్వండి ఎస్సైగారు" కరుణచూపాడు మీనాక్షి తండ్రి.

"సాయంత్రం ఆరయ్యేలోపు మీనాక్షిని తీసుకొని స్టేషన్‌కు రావాలి. తేదనుకో నీ బాడీకి మా లాఠీలకు మధ్య ట్వంటీ ట్వంటీ మ్యాచ్ జరుగుతుంది" వార్నింగ్ ఇచ్చాడు ఎస్సై.

ఇంకా ఒక్కక్షణం కూడా ఆలస్యం చేయకుండా మీనాక్షిని వెతికేందుకు పిచ్చికుక్క తరుముతున్నవాడిలా పరుగుతీసాడు. బంధువులింటికి, తెలిసిన వాళ్లింటికి, చుట్టుపక్కల వాళ్లిళ్లకు బొంగరంలా తిరగసాగాడు.

ఓవైపు ఆకలి 'దంచేస్తున్నా' సాయంత్రానికల్లా మీనాక్షిని అప్పజెప్పకపోతే పోలీసులు 'దంచేస్తారన్న' దడతో ఆఖరికి గోలీసోడా కూడా తాగకుండా ఊళ్లో తెలిసిన ప్రతి ఇంటి డోర్ కొట్టీ, కొట్టీ అలసిపోయాడు.

ఇంక నడవడానికి ఓపిక నశించి ఓచోట కూలబడి, ఇతర ఊళ్లల్లోవున్న బంధు జన సందోహానికి సెల్‌లో ఫోన్ చేసి అడిగాడు. కానీ ఫలితం లేకపోయేసరికి ఇంక తనకు స్టేషన్లో చాకిరేవు తప్పదని డిసైడైపోయాడు.

ఇంతలో సెల్ మోగేసరికి ఒకవేళ మీనాక్షేమో అని ఆతృతగా మాట్లాడాడు. కానీ అవతలినుంచి కంచులా కణేల్‌మంది టూ టౌన్ ఎస్సై కంఠం.

"ఇప్పుడు టైమ్ అయిదయ్యింది. సరిగ్గా గంటలో మీనాక్షి సమేతంగా ఇక్కడుండాలి. లేదనుకో నేనే వచ్చి, నిన్ను నడిరోడ్డుమీద కొట్టుకుంటూ ఈడ్చుకొస్తాను అర్థమైందా" అన్నాడు.

"నా ఖర్మ కాలిపోయిన తర్వాత మీకెందుకు సార్ అంత శ్రమ" నిర్వేదంగా చేతిలోని సెల్‌తో తలబాదుకున్నాడు.

'ఏనాడు ఏ పాపం చేసానో, నాకీరోజు 'భజన' తప్పదు. నా వెధవ 'మెంటాలిటీకి ఈ శాస్తి జరగాల్సిందే' ముక్కుతూ మూలుగుతూ నీరసంగా పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నాడు.

స్టేషన్లో అడుగుపెట్టేసరికి ఎదురుగా మీనాక్షి, రామకృష్ణలు ఉన్నారు. వాళ్లని చూడగానే పీక్కుపోయిన మొహం కాస్తా, ఆరిపోబోతున్న దీపంపై పెట్రోల్ చుక్కవేసినట్టు జిగేల్‌మంది.

మీనాక్షిని చూడగానే దుఃఖం ఎగదన్నుకొచ్చింది.

"మళ్లీ పొరపాటున కూడా ఇలాంటి దిక్కుమాలిన ఆలోచన రానివ్వను. నన్ను క్షమించు మీనాక్షీ!" అంటూ ఆమెను కరుచుకుపోయాడు.


"నీ జబ్బు కుదర్చడానికే తామీ నాటకం ఆడామని, పిచ్చి ఆలోచనలతో కోరి కష్టాలను తెచ్చుకుంటే ఫలితం ఇలాగే వుంటుంది. ఇంతకీ ఎలా వుంది ట్రీట్‌మెంట్" అని నవ్వాడు రామకృష్ణ.

అతని నవ్వుకు అందరూ జత కలిపారు ముకుందంతో సహా.

★

## బుల్లెట్ ట్రైన్

సమీప భవిష్యత్తులో మనం బుల్లెట్ వేగంతో నడిచే రైళ్లను చూడబోతున్నాం. గంటకి 300 కి.మీ వేగంతో నడిచే రైళ్లల్లో ప్రయాణించే రోజు ఎంతో దూరంలో లేదు. అయితే వీటికి ప్రత్యేకమైన మార్గం కలిగి ఉండాలి. ఆ విధమైన రైళ్లను ప్రవేశపెట్టాలని రైల్వేశాఖ తీవ్రంగా ఆలోచిస్తోంది.



దేశంలో మెట్రో నగరంగా వేగంగా ఎదుగుతున్న చెన్నై నగరంలో వీటి ఏర్పాటు ఉండవచ్చు. ఇతర సంబంధ విభాగాలతో చర్చించిన తరువాత బుల్లెట్ రైలు పథకానికి ఆచరణ రూపం ఇవ్వాలని రైల్వే శాఖ నిశ్చయించింది.

-యం.లక్ష్మీకాంతమ్మ

